క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాగాయలంక: మండలంలోని భావదేవరపల్లి, గణపేశ్వరం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో గురువారం కరెంటు నిలిపివేస్తామని మండల విద్యుత్ శాఖ ఏఈ ఏడుకొండలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భావదేవరపల్లిలోని సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, గణపేశ్వరం పరిధిలో గ్రామాలకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఒక గంట పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. భావదేవరపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో కొత్త పీటీఆర్ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు చెప్పారు. ఈ ముందస్తు సమాచారం పరిగణలోకి తీసుకుని వినియోగదారులు సంస్థకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సైనికుడి అకాల మరణం బాధాకరం



పెడన: భారత దేశం గొప్ప సైనికుడిని కోల్పోయిందని, నాగరాజు ఆకాల మరణం చాలా బాధకరమని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం చేవేంద్ర గ్రామంలోని ఆర్మీ జవాన్ సాదరబోయిన నాగరాజు దశదిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత పాల్గొన్నారు. నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తూర్పులద్దాఖ్ వద్ద నదిలో ప్రమాదవశాత్తు మరణించిన నాగరాజు మృతి పట్ల ఎమ్మెల్యే సానుభూతి వ్యక్తం చేశారు. ఈయనతో పాటు జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, టీడీపీ నాయకులు శెలపాటి ప్రసాద్, శీరంప్రసాద్ తదితరులు ఉన్నారు.

పూడిక తీతకు నిధులు మంజూరు చేయండి



నాగాయలంక: మండలంలోని వక్కపట్లవారిపాలెం గ్రామం రెవెన్యూ పరిధిలో 800 ఎకరాలను విపత్తు నుంచి కాపాడే రెండు ప్రధాన డ్రెయిన్లలో పూడికతీత, అభివృద్ధికి నిధులు కేటాయించాలని వక్కపట్లవారిపాలెం సర్పంచి అంబటి శ్యాప్రసాద్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు చల్లపల్లి డ్రెయినేజీ డీఈ వెంకటేశ్వరరావుకు రైతులతో కలిసి వినతి పత్రం అందజేశామని బుధవారం సర్పంచ్ తెలిపారు. గ్రామానికి సంబంధించిన వ్యవసాయం మొత్తానికి ఈ రెండు డ్రెయిన్లే ప్రధానమని, ప్రస్తుతం విరిగిపడిన చెట్లు, మట్టి పూడికలతో అస్తవ్యస్తంగా ఉన్నాయని చెప్పారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ రెండు మురుగుకాల్వల పూడికతీత, అండర్ టన్నెల్ (యూ.టి) తూములు నిర్మాణానికి నిధులు కేటాయించి, పనులు చేపట్టాలని సర్పంచ్ శ్యామ్ డిమాండ్ చేసారు.

రక్షిత మంచినీటి పథకాల పరిశీలన

తెలుగురావుపాలెం(ఘంటసాల): మండలంలోని తెలుగురావుపాలెం, శ్రీకాకుళం గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే వాటర్ ట్యాంకులను సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో కలసి ఎంపీడీవో బి.మారుతీ శేషమాంబ బుధవారం పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున పంచాయతీల్లో వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీటి పైపులు మురుగునీటిలో ఉండకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేములపల్లి గ్రామంలోని డ్రైనేజీ సమస్యను ఎంపీడీవో మారుతీ శేషమాంబ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెలుగురావుపాలెం, శ్రీకాకుళం సర్పంచ్‌లు రాచూరి ప్రసాద్ బాబు, ముప్పనేని రవి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు అశ్విన్ కుమార్, జి.శ్రీనివాసరావు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణలో వైద్య కళాశాలల పాత్ర కీలకం

కోనేరుసెంటర్: క్షయ వ్యాధిని అరికట్టడంలో వైద్య కళాశాల కీలకపాత్ర పోషించాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వీ సుందరాచారి సూచించారు. బుధవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో క్షయ వ్యాధి నివారణ టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి పరీక్షలు పెంచడం ద్వారా కేసులను కనుక్కొని రోగులకు సరైన వైద్యం అందించి, వ్యాధిని నివారించవచ్చన్నారు. ఊపిరితిత్తులకు మాత్రమే కాకుండా ఇతర క్షయ వ్యాధిని కనుగొనడంలో కళాశాల వైద్య నిపుణులు కీలకపాత్ర పోషించాలన్నారు. అప్పుడే వ్యాధి నివారణకు కృషి చేయగలుగుతామని చెప్పారు. జిల్లా అధికారి డాక్టర్ ఐ.వెంకట్రావు, పలు విభాగాల అధిపతులతో క్షయ నిర్ధారణ చికిత్స అంశాలపై చర్చించారు. ప్రభుత్వ సమగ్ర వైద్య కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ కుమార్, జిల్లా సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ పీఠం కోసం పోటీ

- మార్కెట్ కమిటీ ఛైర్మన్ల కోసం ఆశావహులు
- పెడన నియోజకవర్గంలో పెడన, బంటుమిల్లి మార్కెట్ కమిటీలకు పోటీ
- పెడన మార్కెట్ జనసేనకు.. బంటుమిల్లి మార్కెట్ టీడీపీకి..?
- ఓసీ నుంచి పెడనకు..బీసీ నుంచి బంటుమిల్లికి ఇచ్చే యోచనలో అధిష్టానం..?



పెడన వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

పెడన: టీడీపీ అధికార పగ్గాలు చేపట్టడంతో పెడన నియోజకవర్గంలో ఖాళీగా మార్కెట్ కమిటీల ఛైర్మన్ పదవుల కోసం అటు టీడీపీ నాయకులు, ఇటు జనసేన నాయకులు కూడా పావులు కదుపుతున్నారు. పెడన, బంటుమిల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది మే నెలతో అంతకు ముందున్న పాలకవర్గాల గడువు ముగియడంతో కొత్త పాలకవర్గాలు రావాల్సి ఉంది. అనూహ్యంగా టీడీపీ అధికారంలోకి రావడంతో కొత్త పాలకవర్గాలపై ఇప్పుడిప్పుడే టీడీపీ అధిష్టానం దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగానే పెడన, బంటుమిల్లి మార్కెట్ కమిటీలు ఖాళీగా ఉండటంతో వాటిలో పాగ వేసేందుకు టీడీపీ క్యాడర్‌కు చెందిన నాయకులతో పాటు జనసేన నాయకులు సైతం పావులు కదుపుతున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో అంటే గత ఏడాది పెడన మార్కెట్‌ను ఓసీలకు, బంటుమిల్లి మార్కెట్ ఛైర్మన్ సీటును బీసీలకు కేటాయించారు. ఇదే పంథాను టీడీపీ కొనసాగిస్తుందా లేక మార్పులు చేస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆశా వహులు ఎక్కుగానే..

పెడన మార్కెట్ కమిటీ ఛైర్మన్ సీటును పెడన మండలంలోని శెలపాటి ప్రసాద్ తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. ఓసీల నుంచి గూడూరుకు చెందిన పోతన స్వామినాయుడు ముందంజలో ఉన్నారు. వీరిద్దరు కూడా నాకంటే నాకే కావాలని తీవ్రస్థాయిలో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వీరిద్దరు కాకుండా జనసేన నుంచి ఉరివి గ్రామ సర్పంచి పంచకర్ల సురేష్, దాసరి సత్యనారాయణలు కూడా ఈ పదవిని ఆశిస్తున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. బంటుమిల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ రేసులో బంటుమిల్లికి చెందిన టీడీపీ నాయకులు ఇల్లూరి లీలాకృష్ణ, కృత్తివెన్నుకు చెందిన వడుగు తులసీరావు, జనసేనకు చెందిన కూనసాని నాగబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. మరో పక్క పెడన నియోజకవర్గంలోని కొన్ని సీట్లు తన వర్గానికి కూడా ఇవ్వాలని ముఖ్యనాయకుల వద్ద హామీ తీసుకున్న మాజీ డెప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ సైతం తన వర్గానికి చెందిన గుడిసేవ రామారావుకు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి ఇవ్వాలనే ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఏది ఏమైనా పెడన నియోజకవర్గంలోని రెండు మార్కెట్ కమిటీ ఛైర్మన్ సీట్లు తమకంటే తమకే కావాలని నాయకులు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు.

పెడన జనసేనకు..బంటుమిల్లి టీడీపీకి..?

పెడన నియోజకవర్గంలోని పెడన, బంటుమిల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సీట్ల విషయంలో పెడన సీటును జనసేనకు ఇచ్చి, బంటుమిల్లి సీటును టీడీపీకి చెందిన వారికి ఇవ్వాలనే ఆలోచనలలో అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంలో అధిష్టానం ఇష్టాపకారం నడుచుకుంటుందా లేక స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు అప్పగిస్తుందా అనేది కూడా సందేహంగానే ఉంది. అధిష్టానం నిర్ణయమైనా, స్థానిక ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ నిర్ణయమైనా ఒకటి జనసేనకు, మరొకటి టీడీపీకి అనే విషయంలో ఎటువంటి సందేహం లేదని ఆ పార్టీకి చెందిన వారే స్పష్టం చేస్తున్నారు. జనసేనకు పెడన ఇస్తారా లేక బంటుమిల్లి ఇస్తారా అనే విషయాలపై కూడా చర్చలు కొనసాగుతున్నాయి. ఈ నెలాఖరులోగా ఆయా పదవులు కూడా భర్తీ అవుతాయనే విషయాన్ని మార్కెటింగ్ శాఖాధికారులు అంటున్నారు. అందరినీ మచ్చిక చేసుకుంటూ మిగిలిన వారికి ఇతర నామినేటెడ్ పదవులకు హామీ ఇచ్చి ఈ రెండు కమిటీలకు త్వరలోనే ఛైర్మన్లను ఎంపిక చేస్తారని టీడీపీ నాయకులు అంటున్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

అవనిగడ్డ: ప్రభుత్వ వైద్యులు ప్రజారోగ్యం పెంపొందించేదుకు ప్రాధాన్యం ఇవ్వాలని శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. పెదకళ్లేపల్లి, పురిటిగడ్డ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది బుధవారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వ వైద్యులపై ఉందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యసేవలు అందించేలా వైద్యులు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెదకళ్లేపల్లి, పురిటిగడ్డ డాక్టర్లు కె. హారిక, నంబూరి శ్రీరామసాయి, కె.విజయరావు, హెల్త్ సూపర్‌వైజర్లు తోట సుధాకరరావు, నందం బాబూరావు, ఎంపీహెచ్‌వోలు, హెల్త్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ని అభినందిస్తున్న వైద్య, సిబ్బంది

కార్మిక చట్టాలను రద్దు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు

బంటుమిల్లి: సీపీఎం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం బంటుమిల్లిలో జాతీయ కోర్కెల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్మిక చట్టాలను రద్దు చేసి నూతనంగా తీసుకువచ్చిన లేబర్‌కోడ్ రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీంను అమలు చేయాలని, అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పెండింగ్ క్లయిమ్‌లను తక్షణం పరిష్కరించాలని తదితర డిమాండ్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం సెంటరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం తహసీల్దారు వై.రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.నాగేశ్వరరావు, మండల కార్యదర్శి అజయ్‌గౌడ్, సీపీఎం బంటుమిల్లి డివిజన్ కార్యదర్శి మాజేటీ శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పొట్లూరి ధనశ్రీ, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్.జనార్ధనరావు, ఆశా వర్కర్ల యూనియన్, మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్స్, భవన నిర్మాణ కార్మికులు సంఘం, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మోపిదేవి: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మోపిదేవి ప్రధాన సెంటర్‌లో బుధవారం నిరసన తెలిపారు. దేశవ్యాప్తంగా బుధవారం డిమాండ్స్ డే సందర్భంగా ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు సీఐటీయూ మండల అధ్యక్షుడు చిరివెళ్ల రాజశేఖర్ తెలిపారు. లేబర్‌కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల క్లైయిమ్‌లు వెంటనే విడుదల చేయాలని, ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీకరణ పథకం నిలిపివేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేల చొప్పున నిర్ణయించి, అమలు చేయాలని, తదితర డిమాండ్స్‌తో నిరసన తెలిపారు. డొక్కు సత్యనారాయణ, ఆరేపల్లి సుబ్బలక్ష్మి, ఆరేపల్లి పరమేశ్వరావు, వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.



మోపిదేవి ప్రధాన సెంటర్‌లో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఘంటసాల: కార్మికుల ఆల్ ఇండియా డిమాండ్స్ డే కార్యక్రమాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల బ్యాంకు సెంటర్లో కార్మిక సంఘాల మండల నాయకులు వాకా రామచంద్రరావు అధ్యక్షతన కార్మికులు సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన ప్రదర్శనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, ప్రాజెక్టు నాయకురాలు ఎస్.విజయలక్ష్మీ, ఆటో యూనియన్ నేత పడవల బాబూరావు, కొడాలి వెంకటేశ్వరరావు, దొండపాటి కిషోర్, బలే పద్మ, వక్కలగడ్డ బసవరత్నం, పోలంకి రుక్మిణి, గుర్రం భవాని, సునీత, కోటేశ్వరమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులను ఆర్థికంగా ప్రోత్సహించండి

బంటుమిల్లి: గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించి ఆర్థికంగా ఆదుకోవాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మెరిట్ విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. మెరిట్ విద్యార్థులు చదువులను మధ్యలోనే వదిలిపెట్టకుండా ఆర్థికంగా ప్రోత్సహించి అండగా నిలవాలని ఆయన సూచించారు. మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందజేస్తున్న ఎస్సీ సంఘం ప్రతినిధులను, దాతలను అభినందించారు. ఈ సందర్భంగా కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో 574 మార్కులు సాధించిన జి.ప్రవీణ్‌కు మొదటి బహుమతిగా రూ.15 వేల నగదును బహుమతిగా అందజేశారు. ఈ బహుమతిని ఈదా మేరీ అందజేశారు. బంటుమిల్లి మండలం ఆర్తమూరు జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన బి.ఐశ్వర్యకు రెండో బహుమతిగా రూ.10 వేల నగదును అందజేశారు. ఈ నగదును సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి దండే వెంకటరత్నం అందజేశారు. మూడో బహుమతిగా రూ.5 వేలను కృత్తివెన్ను మండలం సంగమూడి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఎం.మహాలక్ష్మికి అందజేశారు. విశ్రాంత ఎంఈవో గంట చిన వెంకటేశ్వరరావు ఈ బహుమతిని అందజేశారు. జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ, ఎంఈవోలు త్రిపురసుందరీ దేవి, వెంకటేశ్వరరావు, ప్రసాదరావు, ఎస్సీ సంఘ నాయకులు మోహనరావు, రవికుమార్, సునీల్‌కుమార్, టీడీపీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తదితరులు

మార్కెట్ కమిటీ మాజీ ఛైర్‌పర్సన్ దంపతులకు సన్మానం



పెడన: స్థానిక మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా గరికిపాటి చారుమతి రెండు సంవత్సరాల పాటు విధులు నిర్వహించి పదవీ కాలం పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఆమె భర్త గరికిపాటి వెంకటరామానాయుడు దంపతులను బుధవారం మార్కెట్ కమిటీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేయించారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలోని సమావేశం హాలులో జరిగిన ఈ వీడ్కోలు కార్యక్రమంలో తనను సన్మానించి సత్కరించి వీడ్కోలు చెప్పిన సిబ్బందికి, తాను అధికారంలో ఉన్న సమయంలో సహాయ సహకారాలు అందించిన ఉద్యోగులు, సిబ్బందికి చారుమతి రామానాయుడు దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యార్డ్ కార్యదర్శితో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి సాయం



కోడూరు: కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కోడూరుకు చెందిన గోసాల సతీష్‌కు కూటమి నేతలు ఆర్థిక చేయూత అందించారు. సతీష్ గత కొంతకాలం నుంచి మంచానికే పరిమితమయ్యాడు. దీంతో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన మండల నేతలు రూ.10 వేల నగదును, 25 కేజీల బియ్యాన్ని సతీష్ కుటుంబ సభ్యులకు అందించారు. టీడీపీ మండలాధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, నేతలు బచ్చు వెంకటేష్, ఉల్లి శేషగిరి, కొండవీటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

చిలకలపూడి(ఘంటసాల): పల్లెవానిపల్లె తాగునీటి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీవో బి.మారుతీశేషమాంబ బుధవారం తెలిపారు. మండలంలోని చిలకలపూడి పంచాయతీ శివారు పల్లెవానిపల్లె గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలియజేస్తూ టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఊసా వెంకటేశ్వరరావు గ్రామస్తులతో ఎంపీడీవో మారుతీ శేషమాంబకు బుధవారం విన్నవించారు. వెంటనే స్పందించిన ఎంపీడీవో పల్లెవానిపల్లె గ్రామాన్ని సందర్శించి మోటారు షెడ్డును పరిశీలించారు. ఎంపీటీసీ కొలుసు ఝాన్సీలక్ష్మి, ఈఓపీఆర్డీ గుత్తికొండ కిషోర్, శ్రీనివాసరావు, బాలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యూటీఎఫ్‌ను బలోపేతం చేసుకుందాం

కృత్తివెన్ను: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్)ను మరింత బలోపేతం చేసుకుందామని ఆ శాఖ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు అన్నారు. బుధవారం చినగొల్లపాలెం, లక్ష్మీపురం, పోడు కాంప్లెక్సుల పరిధిలోని పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శాఖ నాయకులు నిర్వహించారు. వారు ఉపాధ్యాయుల సమస్యలపై అవిశ్రాంతంగా పోరాడుతున్న యూటీఎఫ్‌ను బలంగా తయారు చేసుకుందామన్నారు. 50 సంవత్సరాల స్వర్ణోత్సవ వేడుకల్లో భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ వీరాస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు సూర్యప్రకాష్, ఆదినారాయణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, సుబ్రమణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

డెమొక్రటిక్ పీఆర్టీయూ ఆధ్వర్యంలో..

కోడూరు: మండలంలోని వి.కొత్తపాలెం జెడ్పీ పాఠశాలలో డెమొక్రటిక్ పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. డెమొక్రటిక్ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జేవీఎస్ పేరుమాళ్లు మాట్లాడుతూ ఉద్యోగులకు 27 శాతం ఇంటీరియల్ రిలీఫ్ మంజూరు చేయాలన్నారు. ప్రతి నెలా ప్రమోషన్స్ పునరుద్ధించి, గతంలో లాగా పదోన్నతులకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం సంఘ సభ్యత్వాన్ని నమోదు చేశారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శులు బి.రాఘవ శ్రీనివాసరావు, భూపతి భాస్కరరావు, మండల అధ్యక్షుడు అప్పికట్ల సాంబశివ్య, ప్రధాన క్యాదర్శులు జరుగు నరసింహారావు, పెరవలి రాంబాబు, మన్నె ప్రేమ్‌చంద్, తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ సభ్యత్వ నమోదులో మండల శాఖ ప్రతినిధులు

ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించాలి



ర్యాలీలో బంటుమిల్లి న్యాయమూర్తి భాస్కరరావు, తహసీల్దార్ రవికుమార్ తదితరులు

న్యాయమూర్తి భాస్కరరావు

బంటుమిల్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, ప్రమాదాలను నివారించాలని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్, మండల న్యాయ సేవా సాధికార కమిటీ ఛైర్మన్ ఎం.భాస్కరరావు అన్నారు. బుధవారం రోడ్డు ప్రమాదాల నివారణ అంశంపై మండల న్యాయ సేవాసాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్టు వద్ద నుంచి బంటుమిల్లి అంబేడ్కర్ సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి భాస్కరరావు మాట్లాడుతూ హెల్మెట్ పెట్టుకోకపోతే శిక్ష అర్హులు అవుతారని స్పష్టం చేశారు. ప్రతి ఏటా రోడ్డు ప్రమాద ఘటనాల్లో తలకు గాయమై మరణాలు జరుగుతున్నాయన్నారు. అందుకు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగంతో వాహనాలు నడపవద్దన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. తహసీల్దార్ వై.రవికుమార్ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. బార్ అసోసియేషన్ సభ్యులు యాళ్ల సోమశేఖర్ (శ్యాంబాబు), పళ్లెం వీర వెంకటేశ్వరరావు, ఆర్ఐ శేఖర్, ఏఎస్ఐ చందనమురళి, కోర్టు, రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బంది ఉన్నారు.

పెడన: వాహనాలు నడిపే వారు జాగ్రత్తలు పాటించని కారణంగా రోడ్డు ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయని పెడన ఎస్ఐ టి.సూర్య శ్రీనివాస్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెడన పట్టణంలోని శ్రీ బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న ఎస్ఐ సూర్యశ్రీనివాస్



గూడూరు సెంటరులో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ వీర్రాజు

ఎస్ఐ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండినవారే వాహనాలు నడపాలన్నారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సైదా, కళాశాల అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి, శ్రీనుబాబు, రూపానాగశ్రీ, గంగాధర్, నిరంజనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు: ద్విచక్రవాహన చోదకులకు గూడూరు ఎస్ఐ ఐ.వీర్రాజు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గూడూరు సెంటరులో హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వాహన దారులను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

సమయ పాలన పాటించకపోతే చర్యలు

పెడన: సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించకపోతే శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేయాల్సి ఉంటుందని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య స్పష్టం చేశారు. బుధవారం ఆయన పట్టణంలోని ఒకటో సచివాలయాన్ని ఉదయం 10.30 గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయానికి సచివాలయ ఉద్యోగులు ఎవరూ రాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా ఆ తరువాత వచ్చిన సిబ్బందిని హెచ్చరించారు. పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు ఎవరి బాధ్యతలను వారు సక్రమంగా నిర్వహించాలని, ఫీల్డ్ విజిట్ ఉన్న వారు తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్ మెయింటెన్ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. సచివాలయంలో విధులు నిర్వహించే వారు సమయానికి హాజరు కావాలని తెలిపారు. విధులు పట్ల ఎవరు ఆలసత్వం వహించినా శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేస్తానని, ఇది మొదటి సారి హెచ్చరికగా తెలియజేస్తున్నట్లు చెప్పారు.



ఒకటో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరామయ్య

హుండీ కానుకల లెక్కింపు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లి శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీ ఆదాయం రూ.77,255 వచ్చినట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. మచిలీపట్నం దేవదాయశాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు సమక్షంలో బుధవారం ఆలయ ప్రాంగణంలో కానుకలు లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఏసీ మాట్లాడుతూ 105 రోజులకు ఈ లెక్కింపు నిర్వహించామని తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరువుల కౌలు వేలం వాయిదా

పెదకల్లేపల్లి శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన చెరువుల కౌలు వేలం వాయిదా వేసినట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. ఔత్సాహికులు ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు, తిరిగి ఎప్పుడు నిర్వహించేది తరువాత తెలియజేస్తామన్నారు.

వారాహి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కె.కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెం గ్రామంలో వారాహి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు విద్యాసాగర్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. 7 గంటలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. తొలుత శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్క గ్రామాలైన అవనిగడ్డ, చల్లపల్లి మండలాల నుంచి కూడా తరలివచ్చిన మహిళలు సామూహిక కుంకుమార్చనలో భక్తిశ్రద్ధలతో పాల్గొని అనంతరం అమ్మవారిని దర్శంచుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నాగాయలంక: స్థానిక కృష్ణానదీ తీరం శ్రీకనకదుర్గమ్మ ఆలయంలోని శ్రీవారాహి అమ్మవారి ఆషాఢ గుప్తనవరాత్రుల ఉత్సవంలో బుధవారం అమ్మవారు నిజ వారాహి దేవి రూపంలో పూజలు అందుకుంది. వారాహి దీక్ష ధారణ చేపట్టిన ఆలయ అర్చకులు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, ముదునూరి అచ్యుత శేఖరశర్మలు తెల్లవారు జామున జరిగిన విశేష కారక్రమంలో వారాహిదేవి అలంకారంలోనే అమ్మవారికి శాస్త్రోక్తంగా విశేష కుంకుమ పూజతో ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో వారాహిదేవి, కనకదుర్గమ్మ అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీరామక్షేత్రం కమిటీ ఛైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలా కృష్ణప్రసాద్ (బుజ్జి), బోయపాటి రాము, కమిటీ పెద్దలు పాల్గొన్నారు.



నాగాయలంకలో వారాహిదేవి దర్శనం చేసుకుంటున్న భక్తజనం

ప్రశాంత వాతావరణంలో మొహర్రం నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సుభాన్

కోనేరుసెంటర్: మొహర్రం సందర్భంగా నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా మత పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ సూచించారు. పండగను పురస్కరించుకుని నగరంలోని ముస్లిం కమిటీ సభ్యులు, పెద్దలతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఇనకుదురుపేట పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొహర్రం ఊరేగింపులో గలాటాలు జరగకుండా కమిటీ పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెస్ట్ బీటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని అన్నారు. పోలీసులకు సహకరించాలని కోరారు. సీఐ విద్యాసాగర్, పార్టీల సభ్యులు పాల్గొన్నారు.